నేను ఓడిపోయాను, పూర్తిగా ఓడిపోయాను, పెళ్లి విషయంలో, ప్రియురాలి విషయంలో, ఎక్కడో పాతాళంలోనికి జారిపోతున్నట్లు భావన. నిరాశా నిస్పృహలు నన్ను కమ్ముకొన్నాయి. శరీరంలోని యావత్తూ శక్తి క్షీణిస్తున్నట్లు ఉంది. నిస్తేజంగా నిరామయంగా వాలు కుర్చీలో వాలాను, మనస్సు నిక్షిప్తమైన జ్ఞాపకాలు ఒక్కొక్కటే కళ్ల ముందు 'సినిమా'లా సాక్షాత్కరించడం ప్రారంభమయ్యాయి.

అవి నేను కొత్తగా బ్యాంకు గుమాస్తా ఉద్యోగంలో చేరిన రోజులు. నెల తిరిగితేనే జీతం, పెద్దగా శ్రమలేని వృత్తి, భవిష్యత్తు సుందరస్వప్నంలా భాసించడం మొదలెట్టింది. చక్కని తోడుని ఎన్నుకొని జీవితాన్ని జుర్రుకొందామనే తపన, నన్ను మా వూరి చలం అని పిలిచేవాళ్లు. సినిమా చలం, గుడిపాటి చలం కాదు. నాకు ఇది కొంత గర్వకారణంగా ఉండేది. గ్రంథాల్లో చెప్పినట్లు కార్యేషు దాసీ, కరణేశు మంత్రీ, భోజ్యేషు మాతా శయనేషు రంభా లాంటి భార్యను ఎన్నుకోవాలి అనుకొన్నాను. నాలుగైదు సంబంధాలు చూసి, టెన్త్ ప్యాసయిన జలజను భార్యగా ఎన్నుకున్నాను, నేనూహించిన భార్యను జలజలో చూడగలనని భావించాను, కానీ, నా ఊహలు

# కార్యేషు దాసీ...


నిజంకావని తెలియడానికి అట్టే కాలం పట్టలేదు. జలజ తాననుకొన్నది చేయవలసిందే. భర్త మనసుతో ఆమెకు నిమిత్తం లేదు. పక్కింటి వాళ్లు డైనింగ్ టేబిలు సెట్టు కొన్నారు. తానూ కొనవలసిందే అని పట్టుబట్టింది. మన ఆర్థిక స్థితి అంతబాగాలేదు. తరువాత చూద్దాం అంటే వినలేదు. పట్టుబట్టి అప్పు చేయించి కొనిపించింది. ప్రతి విషయంలో తన మాట చెల్లవలసిందే, లేదంటే అలగడాలు, తొలగడాలు ఎక్స్ట్రా, అప్పుడనిపించింది. జలజ కార్యేషు దాసీ కాదు. కార్యేషు బాసీ అంటే బాసు పులింగం బాసి స్త్రీ లింగం.. ఇకపోతే తన సలహాలు ఉత్తమమైనవనియు, చెత్త ఆలోచనలు తనకు రావనియు జలజకు మితిమీరిన ఆత్వవిశ్వాసం. ఆమె ఆలోచనలు సలహాలు పాటించి, చాలా సార్లు భంగపడ్డాను. అప్పుడనిపించింది జలజ కరణేశు మంత్రీ కాదు కరణేషు కంత్రీ అని, వంట విషయంలో ఏదో ఇంత వండి పడేయడం, పక్కింటి పిన్నితో కబుర్లు చెప్పుకుంటూ ఉండడం ఆమె అలవాటు. ఇంటికి జేరేసరికి జలజ ఎదురొస్తుందనీ, ముఖము కడుక్కునేందుకు వేడినీళ్లు పెట్టి, సబ్బు, టవలు సిద్ధపరచి నన్ను సంతోషపెడుతుందనుకొనే వాడిని. అసలు జలజ లోకమే లోకం, ఫ్లాస్కులో వున్న కాఫీని నేనే వంపుకొని తాగాలి. భోజనం చేసేటప్పుడు దగ్గరగా కూర్చొని వీవనతో విసురుతూ, కొసరి, కొసరి వడ్డిస్తుందనుకొనేవాడిని. ఇలా వడ్డించి అలా బయటకు పోయి కబుర్లు చెప్పేది.

అప్పుడనిపించేది నాకు జలజ భోజ్యేషు మాతా కాదు. అడ్డదిడ్డంగా తిరుగుతుంది కాబట్టి భోజ్యేషు పీతా అని. ఒకరోజు బజార్లో మల్లె పూలు కొనుక్కొని ప్రేమగా తెచ్చి జలజకిచ్చాను. నన్ను తెగ మెచ్చుకొంటూ జడలో తురుముకొంది. పడుకొనే వేళకు, పూలు తీసివేసి భద్రపరచివచ్చింది. నాకు చిరాకేసింది. పూలు తెచ్చింది భద్రపరచడానికా అని చిర్రుబుర్రులాడాను. జలజకదేం పట్టలేదు. మరుసటి రోజు సంతకు పోయేటప్పుడు పెట్టుకుంటానని యిప్పుడు పెట్టుకుంటే సంతకో అని వకీలు ప్రశ్న వేసింది. ఓరినాయనో యిది నా కలలన్నింటిని కల్లలు చేసిందని లోలోపల వాపోయాను, అదేమి అలవాటో. దిండుపై తలపెడుతూనే, జలజకు నిద్రముంచుకొస్తుంది. వెల్లకిలా స్తంభంలా పడిపోతుంది. అందుకే నా కనిపిస్తుంది. జలజ శయనేషు రంభాకాదు శయనేషు కంభా అని. ఇట్లా సంసార జీవితం పట్ల ఒక రకమైన విరక్తి భావం పుట్టేటట్లు చేసింది జలజ. నాలో ఏదో వెలితి ఏర్పడింది. నేనూహించిన సంసారసౌధమునకును, నేనుంటున్న సౌధమునకును ఎక్కడా పొంతనలేదు. భార్యను ఎన్నిక చేయడంలో ఓడిపోయానని తెలుసుకొన్నాను, బ్రతుకున బ్రతుకై, మనసున మనసైన తోడు జలజ కాదు. ఇలా మొండి సంసారం సాగింది ఆరేళ్లకాలంలో మధు, మరియు జ్యోత్స్న పుట్టుకొచ్చారు. నా అసంతృప్తికి ప్రతి రూపాలా అన్నట్లు, వాళ్లిద్దరూ కూడా, జలజతో ఎప్పుడూ తగవులాడుతుండేవారు. ఒక్కొక్కసారి వారు తల్లీ పిల్లలేనా అని అనుమానం వచ్చేది. రాను రాను నాలో జలజపై విరక్తి భావం చోటు చేసుకొంది. ఆడది ఎలా ఉండాలో గుణపాఠం నేర్పాలనే పట్టుదల పెరిగింది. ఆ ప్రయత్నంలో నేను ఇంకొక పెళ్లి చేసుకొన్నా ఫరవాలేదనిపించింది. ఎలా? ఇంకొక స్త్రీని జాగ్రత్తగా ప్రేమించి, పెళ్లాడి నా కలలను నిజము చేసుకోవాలనీ, జలజకు తద్వారా గుణపాఠం చెప్పాలని అనిపించింది. మెల్లగా కార్యాచరణకు పూనుకొన్నాను. ఆ ప్రయత్నంలోనే, శ్యామల టీచరు నాకంటబడింది. శ్యామల మా వూరి యు.పి. స్కూలుల్లో బి.ఇడి టీచరుగా పని చేస్తున్నదని తెలుసుకొన్నాను, ఆమె రోజూ పై వూరు నుండి వచ్చి సాయంత్రము వెళ్లిపోతుంటుంది. సగటు అందంలో వొందికగా ఉన్న శ్యామల అంటే నాలో తెలియని ఆరాధన ప్రారంభమయింది. స్కూలుకు వచ్చేటప్పుడు త్రోవలో ఎదురయ్యేది. ఆమెతోటి ఉపాధ్యాయిని కమల, నా స్నేహితుని చెల్లెలు మాటల సందర్భంలో శ్యామల విషయాలు తెలుసుకొన్నాను. శ్యామల వాళ్లక్క కూడా అవివాహితురాలని అందుకు ఆర్థిక పరిస్థితులు ఇతరత్రా కారణమని విన్నాను. వాళ్లక్క వివాహ వయస్సు దాటిపోయిందనీ, కొన్నేళ్లు పోతే శ్యామల కథ కూడా అలాగే అవుతుందేమోనని కూడా విన్నాను. రోజూ, ఎదురుపడ్డప్పుడు తదేకంగా చూడడం ప్రారంభించాను. ఒకటి రెండుసార్లు కళ్లు కళ్లు కలిసాయి. నా కళ్లలోని ఆరాధన ఆమెకు అర్థమైందనిపించింది. కమలతో నా గురించి అడిగినట్లు తెలిసింది. కానీ నేను వివాహితుణ్ణి, మధునాకుమారుడనీ ఆమెకు తెలుసు. నేను కామాతురుడను కాననియు., ఆరాధకుణ్ణని, మోసగాణ్ణి కానని చెప్పడం ఎలా? మధు ద్వారా ఆమెకు వృత్తిపట్ల వున్న శ్రద్ధ బోధనాపటిమలను తెలుసుకొని ఆశలు పెంచుకొన్నాను. ఇలా ఆరు నెలలు గడిచాయి. ఇక సాహసించవలసిందే. లేఖ రాయాల్సిందేనని నిశ్చయించుకొన్నాను. జలజతో నా అసంతృప్త జీవనం గురించి చెప్పి ఆమె అభిప్రాయం తెలుసుకోవాలనిపించింది. ఒక ఇన్లాండు లెటరు తీసుకొని, రాత్రి 10 గంటలకు లేఖ రాయడానికి పూనుకొన్నాను. రేడియోలో రామునిదొకటే బాణం జానకి ఆతని ప్రాణం, ప్రేమకు ఒకటే నామం, ప్రేయసి ఒకరే న్యాయం ని పాట వస్తోంది. నా మనస్సెందుకో పొరపాటు చేస్తున్నానేమో అనిపించింది. కానీ జలజ ప్రవర్తన గుర్తుకు రాగానే ఆ భావనే ఎగిరిపోయింది. ఆచితూచి జాబును రాశాను.

ప్రియమైన శ్యామలకు

మీరు ఈ జాబూ పూర్తిగా చదవాలని కోరుకొంటున్నాను. నన్ను 'మధునాన్న'గా గుర్తించండి, మిమ్ములను చూసినప్పటి నుండీ, మూర్తీభవించిన స్త్రీత్వం మీలో ఉందనిపించింది. ఈ సంసారికిదేం తెగులని ఈసడించుకోకండి. ఒకసారి మీతోడి ఉపాధ్యాయిని నన్ను మీకు పరిచయం చేయడం గుర్తుందనుకుంటాను. నా భార్య జలజ నా ఆశలన్నిటినీ అడియాసలు చేసింది. ఇంటిని దాదాపు నరకంగా మార్చింది. మగవాడిని ఎలా సుఖపెట్టాలి. సంసారాన్ని ఎలా దిద్దుకోవాలి అనేది బొత్తిగా తెలియదు. ఈ ఈ అసంతృప్త జీవనంలో మీరు ఒక ఆశారేఖగా కనిపించారు. నాది

# డి.వి.రూపాజి



దుడుకుతనం కాదు కేవలం కామాపేక్ష అంతకంటే కాదు. మీరు సమ్మతిస్తే వివాహబంధమేర్పరచుకొంటాను. మీరు బాగా ఆలోచించి నాకు విషయం తెలియపరుస్తారని ఆశిస్తూ ఆరాధనా పూర్వకంగా.

ఇట్లు అని నా అడ్రసు పూర్తిగా వ్రాశాను. ఫ్రం అడ్రసు కూడా జాబుపై స్పష్టంగా వ్రాశాను. ఇంతలో జలజ కదలడం జాబును నా క్యాష్ బ్యాగులో దాచడం జరిగింది. తరువాతి రోజు నేను చేసే వూరి నుండి కాస్త భయం భయంగానే పోస్టు చేశాను. అప్పటి నుంచీ దడ మొదలయ్యింది. ఆమె స్పందన ఎలా ఉంటుందో? నా సాహసాన్ని మన్నిస్తుందా? మెత్తగా చివాట్లు పెడుతుందా? ఏమో? నా కలలను పండించుకోవాలనే ఈ రెండవ ప్రయత్నం ఫలిస్తుందని ఆశించాను. జాబు రాసి మూడు రోజులయ్యింది. బహుశా చదువుకొని ఉంటుంది. నిర్ణయం తీసుకోవడానికి కొంత సమయం పడుతుందనుకొన్నాను ఆత్రం అణచుకోలేక మా అబ్బాయి మధుని, ఆమె గురించి అడిగాను. వాడు ఆమె శెలవులో ఉన్నట్లు, నెల రోజులు శెలవు పెట్టినట్లు చెప్పాడు. నా మనస్సు పరిపరి విధాల పోయింది. ఆమె స్కూలు మార్పించుకొంటుందేమో? నా ఆలోచనలకు దారీ తెన్నూ కనిపించడంలేదు. ఆమె స్నేహితురాలు కమలకు బదలీ అయి రెండు నెలలు కావస్తుంది. కాబట్టి ఆమె విషయం కమల నుండి రాబట్టడం కుదరదు. రాత్రి పూట ఒకసారి అనుకూలంగా, మరొకసారి ప్రతికూలంగా కలలు రావడం ప్రారంభమయింది. నిండుగా పట్టుచీర కట్టుకొని నా ఇంటిలో జరిగే ఏదో వేడుకను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు, అతిథులను, తగిన రీతిలో గౌరవిస్తున్నట్లు నేను దూరంగా కూర్చొని తృప్తి పడుతున్నట్లు కల వచ్చేది. ఇంకొకసారి జలజ, శ్యామల చెరొక చీపురు పట్టుకొని, కొప్పులు కొప్పులు పట్టుకొని ఇంటి ముందు అందరూ నవ్వుతుండగా కొట్లాడుతున్నట్లు భయంకరమైన కల ఒకసారి వచ్చేది. ఇలా కలత నిద్రలు సాగాయి. ఒక్కొక్కసారి అనిపించేది. కోరి కోరి ఆమె మనస్సు గాయపరిచానేమోనని, టైఫాయిడ్ లాంటి జ్వరం వచ్చి మంచానపడిందేమో, ఏదీ ఇదమిత్థంగా తెలియడం లేదు. ఇట్లా నిస్వార్థంగా నెల రోజులు గడిచాయి. ఒక రోజు పరధ్యానంగా డ్యూటీ కోసం వెళ్తుండగా ఆమె ఎదురుపడింది. నా ఆనందానికి హద్దులులేవు, మునుపటి కంటే అందంగా కనిపించింది. అంటే టైఫాయిడ్ లాంటి విషజ్వరం కారణం కాదన్నమాట. ఆమెను చాలా దగ్గరగా చూశాను, ఆమె కూడా నన్ను చూసింది. ముఖంలో కోపం లేదు. అసహ్యమూలేదు. కాబట్టి నాకనుకూలమైన తీర్పు వుంటుందని ధైర్యం చేశాను. దగ్గరగా వెళ్లి "ఏమండీ బావున్నారా?" అంటూ పలకరించబోయి ఆమె మెడ వైపు చూశాను, మైగాడ్! నల్లపూసలు, తాళిబొట్టు మెరుస్తూ కనిపించింది. నా కళ్లు బైర్లు కమ్మాయి. తూలి కిందకుపడినట్లు గుర్తు. తరువాత ఆసుపత్రిలో కళ్లు తెరిచాను. ఎదురుగా జలజ కళ్లనీళ్లతో నిలబడి ఉంది. తర్వాత తెలిసింది. శ్యామలే నన్ను ఆసుపత్రికి చేర్చినట్లు, సమాచారాన్ని జలజకు అందజేసినట్లు. ఇంతలో శ్యామల నా దగ్గరకు వచ్చి పరామర్శించి మాట్లాడింది, మా అబ్బాయి మధు తన ప్రియ విద్యార్థి అనీ, తనకు, వివాహమైమందనియు భర్త పనీ చేసే మండలానికి బదలీ అవుతున్నాననీ, ఇంకా ఏవేవో చెప్తోంది, నాకవిఏవీ స్పష్టంగా వినిపించడం లేదు. నా జాబు చదివి కూడా ఇంత ఆప్యాయంగా ఎలా మాట్లాడగలుగుతోంది శ్యామల? నన్ను మనస్సులో క్షమించి ఉంటుందా? ఏమో? శ్యామల వ్యక్తిత్వం హిమాలయాలంత వున్నంతగా ఉన్నట్లు, నేను మరుగుజ్జులా నిలుచున్నట్లు భావన కలిగింది. జాబు విషయం ఏమైనట్లు? ఈ వన్ మిలియన్ డాలరు ప్రశ్న వేదిస్తూ ఉంది. ఆ సాయంత్రానికి ఇంటి కొచ్చాను, వాలుకుర్చీలో కూర్చొని ఆలోచించసాగాను. జలజ నిమ్మరసం గ్లాసు తీసుకొచ్చి తాగడానికిచ్చింది. నా ప్రక్కనే కూర్చొని, జరిగిన సంగతి చెబుతోంది. నేను పడబోతుండగా, శ్యామల నన్ను పొదివి పట్టుకొందని, రిక్షాలో తానే కూర్చుండబెట్టి ఆసుపత్రికి చేర్చిందని, తరువాత సంగతి తెలియజేసిందనీ చెప్పింది. ఆమె పట్టుకోకుండా పోతే ఆవైపే వస్తూన్న లారీ క్రింద పడేవాడినని, దేవతలాగా కాపాడిందనీ చెప్పుకుపోతోంది. ఊఁకొడుతున్న నాకు ఎదురుగా ఉన్న అల్మరాలోని డిక్షనరీలో పైకి కనిపిస్తూ ఉన్న ఒక ఇన్‌లాండ్ లెటర్ పలకరిస్తున్నట్లు అనిపించింది. గబాలున దాన్ని తీసి చూశాను, అదే అదే అదే నా ప్రేమలేఖ. మరి ఇక్కడకు ఎందుకొచ్చినట్లు? నేను స్వయంగా పోస్టు చేశానే? త్రిప్పి చూశాను అర్థమైంది. కంగారులో అడ్రసు రాయలేదు ఈ వైపు ఫ్రం అడ్రసు ఉండడం వలన తపాలా వాళ్లు తిరిగి నాకే పంపారు. మైగాడ్! అనుకొంటూ తలపట్టుకొన్నాను. ఇంతలో జలజ ఆ జాబు వచ్చి చాలా రోజులైందనీ, ఎప్పటికప్పుడు ఇద్దామనుకొంటూ మరిచాననీ చెప్పింది. అడ్రసు లేదేమిటని చించి చూద్దామని కూడా అనుకొన్నదట., కానీ కుదరలేదట. ఏడుకొండలవాడా? వెంకటరమణా గోవిందా గోవిందా అనుకొని పెళ్లి చేసుకుని పిల్లల్ని కనీ తను ఎంత వక్రంగా ఆలోచించాడో అర్థమైంది. వక్రమార్గంలో ఉన్న భార్య జలజనే మార్చుకుని తన భావాలకు అనుగుణంగా మెలిగేలా చేసుకోవాలని నిర్ణయించుకున్నాను.

●